సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 22 । అక్టోబర్ । 2022



సన్ లైట్

ప్రకృతిలో 'సన్' లైట్ అందించిన సుందర దృశ్యాలు ఇవి. ముంచంగిపుట్టు మండలం కొత్తసుజనకోట సమీపంలో సూర్యోదయ సమయంలో విద్యుత్ స్తంభానికి లైట్ వేలాడుతున్నట్టుగా భానుడు కనువిందు చేశాడు. ఇదే సమయంలో మరోచోట స్తంభంపై ఉన్న పక్షి సూర్యబింబంలో ఒదిగి పోయినట్టుగా అలరించింది.

- ముంచంగిపుట్టు



న్యూస్‌రీల్

ఎన్ఎంఎంఎస్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

పాడేరు రూరల్ : 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించి ఎన్ఎంఎంఎస్ పరీక్షకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రమేష్ తెలిపారు. దరఖాస్తుకు ఈనెల 31 వరకు గడువు ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ,బీసీ, ఓసీ విద్యా విద్యార్థులు రూ.50 పరీక్ష ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు.

గెస్ట్ టీచర్ పోస్టుల అభ్యర్థులకు ధ్రువపత్రాల పరిశీలన

సాక్షి,పాడేరు: పాడేరు ఐటీడీఏ పరిధిలోని 11ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గెస్ట్ టీజీటీ, పీజీటీ టీచర్ పోస్టుల్లో పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 25నుంచి ధ్రువపత్రాల పరిశీలన చేపడుతున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. పాడేరు కలెక్టరేట్‌లో ఈనెల 25 నుంచి 29 వరకు ప్రతి రోజు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత అభ్యర్థులకు దరఖాస్తుల పరిశీలన ఉంటుందన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా ఒరిజినల్ ధ్రువపత్రాలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు కింద్రలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమావేశం

పార్టీ రాజవొమ్మంగి మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ

రాజవొమ్మంగి: మండలంలోని కింద్ర గ్రామంలో శనివారం మధ్యాహ్నం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల కన్వీనర్ శింగిరెడ్డి రామకృష్ణ తెలిపారు. ఈ సమావేశానికి టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి తదితర ప్రముఖులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.


కాఫీ రైతులకు రుణాలు

- పాడేరు డివిజన్‌లో రూ.63.78 లక్షల పంపిణీ
- పార్చ్‌మెంట్ కాఫీ కిలో రూ.270, చెర్రీ రూ.135
- రొబస్టా రూ.60కు కొనుగోలు
- జీసీసీ డీఎం పార్వతమ్మ



సాక్షి,పాడేరు : ఏజెన్సీలో ఈ ఏడాది కూడా గిట్టుబాటు ధరతో కాఫీ రైతుల నుంచి కాఫీ గింజలను కొనుగోలు చేస్తున్నామని జీసీసీ డీఎం కురుసా పార్వతమ్మ తెలిపారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడుతూ పాడేరు జీసీసీ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో 576 మంది కాఫీ రైతులకు రూ.63 లక్షల 78వేల రుణాలను పంపిణీ చేశామని తెలిపారు. రెండు రోజులుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. గత ఏడాది పార్చ్‌మెంట్ కాఫీ గింజలను కిలో రూ.260కు కొనుగోలు చేశామన్నారు. ఈ ఏడాది కిలో రూ.270కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. అలాగే చెర్రీ రకాన్ని కిలో రూ.135, రొబస్టా కిలో రూ.60కు కొనుగోలు చేస్తామని ప్రకటించారు. కాఫీ రైతులంతా ఉత్పత్తులను జీసీసీ సంస్థకు విక్రయించాలని ఆమె కోరారు. దళారులు, వ్యాపారులను ఆశ్రయించి మోసపోవద్దని డీఎం పేర్కొన్నారు.

ఉరకలేస్తున్న జలపాతాలు



కొత్తపల్లి జలపాతం

జి.మాడుగుల: జిల్లాలో కురుస్తున్న వర్షాలకు జలపాతాలు పరవళ్లు తొక్కడంతో కొత్త అందాలు సంతరించుకుంటున్నాయి. ప్రముఖ పర్యాటక ప్రాంతమైన కొత్తపల్లి జలపాతం బండరాళ్లపైనుంచి ఉరకలు వేస్తూ కనువిందు చేస్తోంది. మండలంలోని ఎగ కంఠవరం వద్ద అక్కా చెల్లెల గుమ్మి జలపాతం, గుర్రాయి, కుంబిడిసింగి, వనమామిడి మార్గంలోని జలపాతాలు కొత్తనీటితో ఆకట్టుకుంటున్నాయి. వీటి దగ్గరకు వెళ్లేలా సౌకర్యం కల్పించాలని పర్యాటకులు కోరుతున్నారు.

అమ్మకు నమ్మకం

గిరిజన ప్రాంతంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవానికి గర్భిణులు రావాలంటే విముఖత చూపేవారు. ఇళ్ల వద్దనే ప్రసవాలు చేసుకుంటూ ప్రాణాల మీదకు తెచ్చుకునేవారు. వైద్యులు, సిబ్బంది ఎంత చెప్పినా వారి మాటలు పట్టించుకునేవారు కాదు. ప్రస్తుతం ప్రభుత్వాసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపడ్డాయి. ప్రస్తుత ప్రభుత్వంలో వాటి స్థితిగతులే మారిపోయాయి. ఆస్పత్రులపై నమ్మకం ఏర్పడటంతో ప్రసవాలు చేసుకుంటూ వైద్యసేవలు పొందుతున్నారు. తల్లీబిడ్డ సుఖంగా ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇప్పుడు రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో జిల్లా నిలిచిందని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెరుగుతున్న ప్రసవాలు
- ఆరు నెలల్లో 7493..
- సురక్షితంగా తల్లీబిడ్డలు
- రాష్ట్రంలో మొదటి జిల్లాగా అల్లూరి



తల్లీబిడ్డలతో ముంచంగిపుట్టు వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరుగుతోంది. ఆధునిక సౌకర్యాలతో వైద్యసేవలు అందుబాటులోకి రావడంతో తల్లీబిడ్డలు క్షేమంగా ఇళ్లకు చేరుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేకూరే ప్రయోజనాలు, ఇళ్లవద్ద ప్రసవాల వల్ల అనర్థాలపై వైద్యసిబ్బంది గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో గర్భిణులు ముందస్తుగానే ప్రభుత్వాస్పత్రుల్లో చేరుతున్నారు. మాతా శిశు మరణాలు సైతం తగ్గుతూ వస్తున్నాయి. జిల్లాలోని 22 మండలాల్లో 72 ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో గత ఆరు నెలల వ్యవధిలో 7,493 ప్రసవాలు జరిగాయి. రాష్ట్రంలోనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల్లో జిల్లా మొదటి స్థానంలో ఉంది. ఏప్రిల్ నెలలో 1336, మేలో 1308, జూన్‌లో 1152, జూలైలో 1185, ఆగస్టులో 1211, సెప్టెంబర్‌లో 1301 చొప్పున ప్రసవాలు జరిగాయని అధికారవర్గాలు తెలిపాయి. జిల్లాలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో గతంలో కన్నా పూర్తి స్థాయిలో వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి. కేజీహెచ్ (విశాఖ)కు రిఫర్ చేసే కేసుల సంఖ్య గణనీయంగా తగ్గింది. 90 శాతం ప్రసవాలు స్థానిక ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయి.

జిల్లా ఆస్పత్రిలో ఆధునిక సౌకర్యాలు..

- పాడేరు జిల్లా ఆస్పత్రిలో శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఇక్కడ ఆధునిక పరికరాలతో కూడిన ఆపరేషన్ థియేటర్ ఉంది. గర్భిణులకోసం ప్రత్యేక ప్రసూతి విభాగం ఏర్పాటు చేశారు. మండల కేంద్రాల్లో పీహెచ్‌సీల్లో ప్రతి నెలా గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నారు.
- గర్భిణులకు ప్రసవం తేదీని సంబంధిత ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ముందుగానే తెలియజేస్తున్నారు. వారిని ముందుగానే ఆస్పత్రుల్లో చేర్పిస్తున్నారు. ప్రసవ అనంతరం వారి పరిస్థితిని రెండు మూడు రోజులపాటు పర్యవేక్షించి తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఇంటికి చేర్చుతున్నారు.
- తల్లికి విశ్రాంతి సమయంలో ప్రభుత్వం రూ.5 వేల ఆర్థికసాయం అందిస్తోంది. గర్భం దాల్చిన దగ్గర నుంచి ప్రసవం జరిగి ఇంటికి వెళ్లే వరకు ప్రభుత్వం అన్ని రకాల భరోసా కల్పిస్తోంది.
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం ద్వారా నెలలో 25 రోజుల పాటు పౌష్టికాహారం అందిస్తూ గర్భిణులు రక్తహీనతకు గురికాకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఈ కారణంగా ప్రభుత్వాస్పత్రుల్లో రోజురోజుకూ ప్రసవాల సంఖ్య పెరుగుతోంది.



ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో ప్రసవం అనంతరం బిడ్డతో తల్లి

మండలాలు	: 22
మొత్తం ఆస్పత్రులు	: 72
రౌండ్ ది క్లాక్ సేవల పీహెచ్‌సీలు	: 63
సీహెచ్‌సీలు	: 5
ఏరియా ఆస్పత్రులు	: 2
సబ్ జిల్లా ఆస్పత్రి	: 1
జిల్లా ఆస్పత్రి	: 1
శిశు సంరక్షణ కేంద్రాలు	: 8

ప్రైవేట్ ఆస్పత్రుల్లో కన్నా మెరుగైన వైద్యం



ప్రభుత్వాస్పత్రిలో గతంలో సరిగ్గా వైద్యం అందేదికాదు. ప్రస్తుతం ఆస్పత్రులో చక్కని వైద్యం అందిస్తున్నారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కంటే మెరుగైన వైద్యం అందుతోంది. మా గ్రామంలో గతంలో ఇంటి వద్ద ప్రసవాలు జరిగిన సందర్భంలో డెలివరీ సమయంలోనే పిల్లలను కోల్పోయేవారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉండాలంటే ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవాలు జరుపుకోవాలి.

– వి.సావిత్రి, బాలింత, గలగండ, పెదగూడ, ముంచంగిపుట్టు మండలం

ఇళ్ల వద్ద ప్రసవాలు వద్దు



ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల వల్ల తల్లీబిడ్డ క్షేమంగా ఉంటారు. ఇదే విషయం చాలా సందర్భాల్లో గర్భిణులకు చెబుతూ వస్తున్నా. ప్రసవ సమయానికి ముందే ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించాలి. ప్రభుత్వం గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేకదృష్టి సారించి పౌష్టికాహారం అందిస్తోంది. ఇంటి వద్ద ప్రసవానికి స్వస్తి పలకాలి.

– జల్లిపల్లి సుభద్ర, ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్

వైద్యసిబ్బంది కృషితో సాధ్యం



ప్రభుత్వాస్పత్రుల్లో గర్భిణుల ప్రసవాల సంఖ్య పెరిగింది. ప్రసవానికి ముందుగానే ఆస్పత్రుల్లో చేరుతున్నారు. కిందస్థాయి వైద్య సిబ్బంది ఎంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నారు. కొత్త జిల్లా ఏర్పడిన ఏప్రిల్ నుంచి ఇళ్ల వద్ద 18 మాత్రమే ప్రసవాలు జరిగాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరగడంలో జిల్లా ప్రథమ స్థానంలో ఉంది.

– జమాల్ బాషా, జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి

నేడు శ్రీనివాసుని కల్యాణోత్సవం



లాగరాయిలో ఏర్పాటుచేసిన కల్యాణ వేదిక

- లాగరాయిలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు
- పాల్గోనున్న టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి గ్రామంలో శనివారం శ్రీనివాసుని కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. తిరుపతి డిప్యూటీ కలెక్టర్ జి. విజయలక్ష్మి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రాంగణంలో వేదిక ఏర్పాటుచేశారు. కల్యాణ వేదిక వద్ద సుమారు ఐదు వేల మంది భక్తులు కూర్చొనేలా సౌకర్యం కల్పించారు. ఉదయం 8 గంటల నుంచి అన్నమాచార్య కళాకారుల బృందం ఆధ్వర్యంలో కీర్తనలు, హరికథ ఏర్పాటుచేశారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్వామివారి కల్యాణం జరుగుతుందని తిరుపతి డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి తెలిపారు. అన్నప్రసాద వితరణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. శ్రీనివాసుని కల్యాణోత్సవం నేపథ్యంలో టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి శనివారం లాగరాయి విచ్చేస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి తెలిపారు.

శాంతిభద్రతల పరిరక్షణలో సేవలు మరువలేనివి



పోలీసు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ సతీష్‌కుమార్, సబ్ కలెక్టర్ అభిషేక్, ఇతర పోలీసు అధికారులు

- కలెక్టర్ సుమిత్‌కుమార్
- పోలీసు అమరవీరులకు ఘన నివాళి



సాక్షి,పాడేరు : సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు మరువలేనివని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శుక్రవారం జిల్లా కేంద్రం పాడేరులోని తలారిసింగి సీపీహెచ్ పాఠశాల మైదానంలో పోలీసుశాఖ నిర్వహించింది. ఈ సందర్భంగా పోలీసుల నుంచి కలెక్టర్ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆయనతోపాటు ఎస్పీ సతీష్‌కుమార్, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ఏఎస్పీ (అడ్మిన్) తుహిన్ సిన్హా, చింతపల్లి ఏఎస్పీ శివ కిషోర్‌లు అమరవీరుల స్తూపం వద్ద పూలమాలలు ఉంచి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విధి నిర్వహణలో అమరులైన పోలీసులందరికి ఘనంగా నివాళులు అర్పించడమే కాకుండా వారి కుటుంబాలకు కూడా కృతజ్ఞతలు తెలుపుకునే రోజన్నారు. ప్రజల భద్రత కోసం విపత్కర పరిస్థితుల్లో ప్రాణాలు సైతం లెక్కచేయకుండా విధులు నిర్వహిస్తున్న పోలీసుల త్యాగాలను ప్రజలు గుర్తించి తగిన గౌరవం ఇవ్వాలన్నారు. పోలీసు అమరవీరుల ఆశయాల సాధనకు పోలీసు యంత్రాంగమంతా కృషి చేయాలని కలెక్టర్ కోరారు. ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ పోలీసులు దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వహిస్తున్నారన్నారు. దేశ వ్యాప్తంగా అనేక పోలీసు విభాగాలు చిత్తశుద్ధితో ప్రజల సంక్షేమమే లక్ష్యంగా విధులు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే 308 మంది పోలీసులు విధి నిర్వహణలో వీరమరణం పొందారని ఆయన తెలిపారు. వారందరి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నామని తెలిపారు. ఆయా కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ(ఏఆర్) వి.సత్తిరాజు, డీఎస్పీలు వెంకటరావు, మూర్తి, సీఐలు జీడీ బాబు, సత్యనారాయణ, సుధాకర్, అప్పన్న, స్వామినాయుడు, పలువురు ఎస్ఐలు, పోలీసు అమరుల కుటుంబ సభ్యులు, పాడేరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీసులు పాల్గొన్నారు.

12న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న జడ్జి ఉమాదేవి

పాడేరు రూరల్ : జిల్లాలోని పాడేరు, అరకు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు పరిధిలో కేసులకు సంబంధించి వచ్చేనెల 12న పాడేరు కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు పాడేరు ప్రథమశ్రేణి జ్యుడీషియల్ కోర్టు జడ్జి ఉమాదేవి తెలిపారు. ఈ విషయమై చర్చించేందుకు శుక్రవారం పాడేరు కోర్టులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆయా ఆయా కోర్టుల పరిధిలోని పోలీసుస్టేషన్లలో కేసులకు సంబంధించిన ముద్దాయిలు, ఫిర్యాదుదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాడేరు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాగుపల్లి రమేష్, మండల లీగల్ సర్వీస్ అథారిటీ సభ్యుడు తమర్బ ప్రసాద్ నాయుడు, పాడేరు ఎస్ఐ లక్ష్మణ్, పాడేరు కోర్టు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

టీటీడీ ప్రచార రథానికి ఘన స్వాగతం



స్వాగతం పలుకుతున్న మహిళలు

రాజవొమ్మంగి: తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచారరథానికి భక్తుల నుంచి ఘన స్వాగతం లభించింది. శుక్రవారం రాజవొమ్మంగి వచ్చిన రథానికి భక్తులు పసుపు నీళ్ల కడవలతో ఎదురెళ్లి పాలిమేరలో పారబోశారు. స్వామివారికి నైవేద్యం సమర్పించి దర్శించుకున్నారు. గ్రామంలో నిర్వహించిన రథం ఊరేగింపులో పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని సమరసత సేవా ఫౌండేషన్ ప్రచారక్‌లు విశ్వనాథ రెడ్డి, సత్యనారాయణ, గుప్తా, తమ్మారావు తదితరులు పర్యవేక్షించారు.

'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్యం



ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, చిత్రంలో నర్సింగరావు

- కలెక్టర్ సుమిత్ కుమార్
- అంబులెన్సు ప్రారంభం

సాక్షి,పాడేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ఫ్యామిలీ డాక్టర్' కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని గిరిజనులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందుతాయని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. ఫ్యామిలీ డాక్టర్ అంబులెన్సు ట్రయల్ రన్‌ను శుక్రవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద జెండా ఊపి ఆయన ప్రారంభించారు. సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ అంబులెన్సులో 67 రకాల మందులు, 14 రకాల వైద్య పరీక్షలు అందుబాటులో ఉన్నాయన్నారు. గర్భిణులు, బాలింతలకు యాంటినెటల్ పరీక్షలతో పాటు పోస్టునెటల్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. నవజాత సంరక్షణ సేవలు పూర్తిస్థాయిలో అందిస్తారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఫ్యామిలీ వైద్యుడితో పాటు వైద్య బృందాలు సందర్శించి రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులను గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందిస్తారన్నారు. గ్రామాల్లో మంచానికే పరిమితమైన వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నేరుగా వారి వద్దకు వెళ్లి వైద్యసేవలందిస్తారన్నారు. ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య ఆరోగ్య సేవలను విస్తృతం చేస్తుందన్నారు.గిరిజన గ్రామాల్లోని ప్రజలందరికి ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా సత్వర వైద్య సేవలు అందుబాటులో తేవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డీఎంహెచ్‌వో డాక్టర్ జమీల్ బాషా, జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవి, విశాఖపట్నం ఆర్‌టీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలా ప్రసాద్, డీటీసీవో డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, పలువురు వైద్యులు పాల్గొన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి సంబంధించి ... పీహెచ్‌సీల పరిధిలో.. చోట్ల ఏర్పాటుచేశారు.



ఐ.పోలవరం సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ అనూష

రంపచోడవరం: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వల్ల గ్రామస్థాయిలో మెరుగైన వైద్యసేవలు అందుతాయని ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని ఐ.పోలవరం గ్రామ సచివాలయం పరిధిలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య బృందం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటలు వరకు గ్రామంలో అందుబాటులో ఉంటుందని తెలిపింది. ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలుచేయాలని సిబ్బందిని ఆమె ఆదేశించారు. సీతపల్లి వైద్యాధికారి రాధిక, రంపచోడవరం 104 వైద్యాధికారి శ్వేతాదేవి, రంపచోడవరం డివిజనల్ మేనేజర్ ఎం సతీష్‌కుమార్, 104 డీఈవో కేవెల్ హరికుమార్, ఎస్ నాగమణి, జానకి, మౌనిక, ప్రభావతి పాల్గొన్నారు.



అంబులెన్సులో పరీక్షలు, మందులను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

ఉపాధి అవకాశాలు సద్వినియోగం

- అరకు ఎంపీ మాధవి, రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి
- మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన
- 155 మందికి కొలువులు



నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి, పీవో సూరజ్ గనోరే

మారేడుమిల్లి : రాష్ట్ర ప్రభుత్వం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని యువత ఉద్యోగ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. స్థానిక వైటీసీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళాను ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, సబ్ కలెక్టర్ శుభం బన్సల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం విశేష కృషి చేస్తుందన్నారు. ఈ జాబ్ మేళాలో నవతా రోడ్డు ట్రాన్స్ పోర్ట్ , గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, అమరాన్ రాజు ప్రైవేట్ లిమిటెడ్, అపోలో ఫార్మసీ, మదర్ అండ్ ఫాదర్ నర్సింగ్ సర్వీసెస్, వరుణ్ మోటార్స్, మోహన్ స్పిన్ టెక్స్ ఇండియా, శుభ గృహ ప్రాజెక్ట్ , ముత్తూట్ ఫైనాన్స్, ఆస్ట్రోటెక్ స్టీల్, డిక్సన్ ఇండియా, బ్లూ స్టార్, డీమార్టు సెంట్రల్ ఫార్మసీ, రిలయన్స్ జియో తదితర 15 సంస్థలు పాల్గొన్నాయన్నారు. 543 మంది అభ్యర్థులు హాజరుకాగా 155 మంది ఎంపికయ్యారన్నారు. ఐటీడీఏ పీవో మాట్లాడుతూ సూరజ్ గనోరే మాట్లాడుతూ ఎంపికైన అభ్యర్థులు ఆదేరంగంలో కష్టపడి నైపుణ్యం పెంపొందించుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. సబ్ కలెక్టర్ శుభం బన్సాల్ మాట్లాడుతూ వివిధ కంపెనీల నుంచి వచ్చిన అధికారులు ఎంపికైన యువతకు అవసరమైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను ప్రజాప్రతినిధులు, అధికారులు అందజేశారు. ఎంపీడీవో వీరకిషోర్, జెడ్పీటీసీ గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కొండ రవి కుమార్, సర్పంచ్ కొండా జాకబ్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోండి

- అధికారులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- ఐటీడీఏ స్పందనలో 125 వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు : ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి వచ్చిన వినతులన్నింటిని పరిశీలించి వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 125 వినతులను స్వీకరించారు. గిరిజనుల సమస్యలను కలెక్టర్ స్వయంగా తెలుసుకున్నారు. పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సబ్ కలెక్టర్ వి.అభిషేక్, ఐటీడీఏ ఏపీవో ప్రభాకరరావు, గిరిజన సంక్షేమ డీడీ ఐ.కొండలరావు, గిరిజన సంక్షేమ ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, ఆర్అండ్‌బీ, పీఆర్ ఈఈలు బాలసుందరబాబు, లావణ్యకుమార్, కొండయ్య పడాల్, డీఈవో పి.రమేష్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కె.లీలాప్రసాద్, జీసీసీ డీఎం కె.పార్వతమ్మ, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతుల్లో కొన్ని..

- హుకుంపేట మండలం బూర్జ గ్రామం నుంచి తుంబలవలస మీదుగా వై.సర్తంగి గ్రామానికి రోడ్డు నిర్మించాలని ఎంపీటీసీ సభ్యుడు మజ్జి హరి వినతి పత్రం అందజేశారు.
- జి.కె.వీధి మండలం దేవరాపల్లి పంచాయతీ వాడమామిడి నుంచి పెద్దపాడు గ్రామం వరకు రహదారి నిర్మించాలని, పాఠశాలకు భవనం మంజూరు చేయాలని గ్రామస్తులు పి.గోపి, రమేష్, తదితర 20 మంది కలెక్టర్‌ను కోరారు.
- జి.మాడుగుల మండలం కోరాపల్లి పంచాయతీ చుట్టుపల్లికి రహదారి నిర్మించాలని కోరాబు చిన్నయ్యపడాల్, కె.సాంబమూర్తి విన్నవించారు.
- డుంబ్రిగుడ మండలం గసబ పంచాయతీ లోగిలి డీఆర్ డిపో నిర్వహణ బాధ్యతను గులాబి స్వయం సహాయక సంఘానికి అప్పగించాలని కొర్ర శాంతి వినతి పత్రంలో పేర్కొన్నారు.
- ముంచంగిపుట్టు మండలం పెదగూడ డీఆర్ డిపో భవనానికి మరమ్మతులు చేయాలని కె.మన్మథరావు, చిన్నారావు పేర్కొన్నారు.
- హుకుంపేట మండలం సంతారి గ్రామ పంచాయతీ ఎగసంతారి, టిటింగ్ పుట్టు గ్రామాల మధ్య కల్వర్టు నిర్మించాలని సర్పంచ్ పాడి అప్పలనాయుడు కలెక్టర్‌కు విన్నవించారు.



అన్నవరం టూ భద్రాచలం టెంపుల్ సర్వీస్

విలీన మండలాల ప్రజల అభ్యర్థన

కూనవరం: పవిత్ర పుణ్యక్షేత్రమైన అన్నవరం దేవస్థానం నుంచి దేశంలోనే అతిపెద్ద రెండో పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలం దేవస్థానం పరిధి శ్రీవైకుంఠ సీతారామ చంద్రస్వామివారి ఆలయం వరకు టెంపుల్ టూ టెంపుల్ బస్సు సర్వీస్ (ఏపీఎస్ఆర్టీసీ) ఏర్పాటు చేయాలని విలీన మండలాల వాసులు కోరుతున్నారు. కార్తీకమాసం పురస్కరించుకుని ఏర్పాటు చేస్తే భక్తులకేగాక ప్రయాణికులకు సైతం ఎంతో మేలవుతుందని ఎన్నోయేళ్ల నుంచి కూనవరం, వీఆర్ పురం, చింతూరు, ఎటపాక మండలాల ప్రజలు చెబుతున్నారు. ఈ మేరకు ఏపీఎస్ ఆర్టీసీ కాకినాడ రీజనల్ మేనేజర్‌కు గతంలో వినతి పత్రం ఇచ్చారు. దీనిపై ఏపీఎస్ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా సానుకూలంగా స్పందించారు.

డ్వాక్రా నిధుల గోల్‌మాల్‌పై విచారణ

చింతూరు: వైఎస్సార్ క్రాంతి పథంలో నిధుల గోల్‌మాల్‌పై నలుగురు సభ్యులతో కూడిన కమిటీ శుక్రవారం చింతూరులో విచారణ చేపట్టింది. సంబంధిత శాఖ సిబ్బంది తమ సొమ్ములు కాజేశారంటూ మండలంలోని ఎర్రంపేట, అల్లిగూడెం, రత్నాపురం గ్రామాలకు చెందిన బాధితులు ఇటీవల ఐటీడీఏ పీవో రామశేషుకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఆయన విచారణ చేయాలని డీఆర్‌డీఏ పీడీ మురళిని ఆదేశించారు. ఈ మేరకు విచారణ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు నాలుగు రోజులపాటు విచారణ చేపట్టి ఈ నెల 25న నివేదిక ఇవ్వాలని పీడీ ఆదేశించారు. దాంతో వైఎస్సార్ క్రాంతిపథం పాడేరు డీపీఎం వైకుంఠరావుతోపాటు దాసు, రఘు, రాజుబాబులతో కూడిన కమిటీ తొలిరోజు ఎర్రంపేటలోని రచ్చబండ వద్ద మహిళా సమాఖ్య సభ్యులను విచారించారు. ఈ సందర్భంగా పది గ్రూపులకు సంబంధించిన 40 మంది మహిళల సొమ్ము సిబ్బంది వాడుకున్నారని కొంతమంది, తాము తీసుకున్న సొమ్ము ప్రతి నెలా సిబ్బందికి ఇచ్చినా, వాటిని బ్యాంకులో జమ చేయకుండా కాజేశారని మరికొంతమంది ఫిర్యాదు చేశారు. అనంతరం వారి నుంచి కమిటీ సభ్యులు రాతపూర్వక ఫిర్యాదులు తీసుకున్నారు. అంతకుముందు కమిటీ సభ్యులు వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో నిధుల గోల్‌మాల్‌కు సంబంధించి వివరాలు సేకరించారు. అనంతరం ఐటీడీఏ పీవో రామశేషును కలిశారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఈ ఘటనపై లోతుగా విచారణ చేపట్టి నివేదిక అందించాలని ఆదేశించారు.



ఎర్రంపేటలో మహిళా సమాఖ్య సభ్యుల నుంచి వివరాలు సేకరిస్తున్న కమిటీ సభ్యులు

పల్లె వెలుగు బస్సును ఢీకొన్న లారీ



ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

యలమంచిలి : మండలంలో జాతీయ రహదారి పురుషోత్తపురం గ్రామం సమీపంలో శుక్రవారం పల్లె వెలుగు బస్సును వెనుక నుంచి లారీ ఢీకొట్టింది. రూరల్ ఎస్ఐ సన్నిబాబు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి నుంచి పాయకరావుపేట ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును పురుషోత్తపురం హైవే కూడలి వద్ద వెనుక వస్తున్న లారీ ఢీకొట్టింది. అయితే ఈ ఘటనలో బస్సులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు సురక్షితంగా ఉన్నారు. ప్రమాదంలో బస్సు వెనుక భాగం దెబ్బతినగా లారీ ముందు భాగం నుజ్జయింది. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యదేవుని మాలధారణ



సత్య దీక్షకు మాల ధరిస్తున్న వెంకటరామయ్య



స్వామివారికి పూజలు చేస్తున్న భక్తులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో శుక్రవారం సత్యదేవుని మాలధారణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో కోలాహలంగా మారింది. దీక్షా వస్త్రాలు ధరించిన భక్తులతో క్షేత్రం వ్యవస్థాపకుడు తణుకు వెంకటరామయ్య మాల ధరింపజేశారు. సుమారు 10 గ్రామాలకు చెందిన 156 మంది సత్యదేవుని మాల ధరించి దీక్ష చేపట్టారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటులో పారదర్శకత

- న్యాయ సమీక్షకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు అంశం
- నవంబర్ 1లోగా ప్రజలు సలహాలు, సూచనలు తెలపాలి
- ఈపీడీసీఎల్ సీఎండీ సంతోషరావు సూచన



సాక్షి, విశాఖపట్నం: ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, ఏలూరు సర్కిళ్ల పరిధిలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుకు టెండర్ల ప్రక్రియకు ముందు సంబంధిత డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపించినట్లు సంస్థ సీఎండీ కె. సంతోషరావు శుక్రవారం తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్డీఎస్ఎస్)లో భాగంగా అడ్వాన్స్ మీటరింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీస్ ప్రొవైడర్స్ (ఎఎంఐఎస్పీ) ద్వారా ఈపీడీసీఎల్ పరిధిలో 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, ప్రభుత్వ కార్యాలయాలకు పాత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. వీటిని నిర్మాణం, నిర్వహణ (టోటెక్స్) పద్ధతిలో ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నామని వివరించారు. అయితే స్మార్ట్ మీటర్లకు సంబంధించిన పనుల్లో పారదర్శకత కోసం వినియోగదారుల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు వీలుగా ఈ డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపినట్లు వెల్లడించారు. ఈ డాక్యుమెంట్లను జ్యుడిషియల్ కమిషన్ అధికారిక వెబ్‌సైట్ www.judicialpreview.ap.gov.in లో పొందుపరిచామని సీఎండీ తెలిపారు. స్మార్ట్ మీటర్ల అంశంపై ప్రజలు, వినియోగదారులు తమ సలహాలు, సూచనలు, అభ్యంతరాల్ని నవంబరు 1వతేదీ సాయంత్రం 5 గంటలలోపు వెబ్‌సైట్‌లో పొందుపరచాలని సీఎండీ సంతోషరావు కోరారు.

బాలికలకు రక్షణ కవచంగా 1098 హెల్ప్‌లైన్

కొయ్యూరు: చైల్డ్ లైన్ 1098 బాలికలకు రక్షణ కవచంలా పనిచేస్తుందని చైల్డ్ లైన్ జిల్లా కోఆర్డినేటర్ జి. డేవిడ్‌రాజు తెలిపారు. చైల్డ్ లైన్, సీడ్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం రాజేంద్రపాలెం, పలకజీడి, రావణాపల్లి, వైస్ పాకల బాలికల ఆశ్రమ పాఠశాలల్లో ఆయన అవగాహన కల్పించారు. బాలికల హక్కులతోపాటు లైంగిక దాడుల నుంచి ఎలా తప్పించుకోవాలి, ఆత్మ రక్షణకు వీలుగా కరాటే నేర్చుకోవడంపై వివరించారు. బాలికలను వేధించినా, లైంగిక దాడి చేసినా, పోక్సో చట్టం ప్రకారం శిక్షలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఎవరైనా వేధిస్తే నేరుగా 1098కు ఫోన్ చేయాలని సూచించారు. ముఖ్య అతిథిగా హాజరైన సీడ్ సంస్థ కార్యదర్శి వి. సన్యాసిరాజు మాట్లాడుతూ బాలికలకు చట్టపరంగా ఉన్న రక్షణ కవచాలను వివరించారు. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్, హెచ్ఎంలు గోపాల్, మదు భాషిణి, గీతాంజలి, చైల్డ్ లైన్ సభ్యులు మీనా కుమారి, కనకమహాలక్ష్మి, ఈశ్వరమ్మ డిప్యూటీ మేట్రిన్ సుజ్ఞానరత్నం పాల్గొన్నారు.



రాజేంద్రపాలెం బాలికల పాఠశాలలో మాట్లాడుతున దేవిడ్‌రాజు

40 కేజీల గంజాయితో ఇద్దరు అరెస్టు

మోతుగూడెం : డొంకరాయి పోలీస్ స్టేషన్ పరిధిలోని వనదుర్గమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో గంజాయితో ఇద్దరు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారంతో చింతూరు నుంచి సీలేరు వెళ్లే రోడ్డులో వనదుర్గమ్మ అమ్మవారి గుడి సెంటర్ వద్దకు వెళ్లగా 40 కేజీల గంజాయితో సూరజ్ అవినాష్‌రావు, మల్లాల సంతోష్ పట్టుబడినట్టు తెలిపారు. వారిని అరెస్టు చేసి రంపచోడవరం జెఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరిచినట్టు తెలిపారు.



పోలీసులకు పట్టుబడిన నిందితులు

సీలేరు గ్యాస్ గొడౌన్ తరలించేది లేదు

ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

సీలేరు: సీలేరులో గ్యాస్ గొడౌన్‌ను దారకొండ పంచాయతీకి తరలిస్తున్నారన్న ప్రచారంలో వాస్తవం లేదని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తెలిపారు. సీలేరు గ్యాస్ వినియోగదారులకు గతంలో సకాలంలో గ్యాస్ అందక తీవ్ర ఇబ్బందులు పడేవారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే గ్యాస్ గొడౌన్ నిర్మించి మూడేళ్ల క్రితం ప్రారంభించామన్నారు. దానిని దారకొండకు తరలిస్తున్నారని కొందరు దుష్ప్రచారం చేస్తున్నారన్నారు. దారకొండ ప్రజలకు మినీ గొడౌన్ ఏర్పాటు చేయాలని అధికారులను కోరామన్నారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక కొంత మంది ఇటువంటి తప్పుడు ప్రచారాన్ని సృష్టిస్తున్నారని, ప్రజలు నమ్మవద్దని స్థానిక నాయకులు కృష్ణమూర్తి, స్వర్ణలత, బుజ్జి కోరారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం

అరకు ఎమ్మెల్యే పాల్గుణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు



అరకు ఎమ్మెల్యే సమక్షంలోని పార్టీలో చేరుతున్న టీడీపీ నాయకులు

అనంతగిరి: టీడీపీ భూస్థాపితం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలో కాశీపట్నం వైస్ సర్పంచ్ సారా రాంబాబు సహా తట్టవలస, సీతంపేట, పందిరిమామిడివలస, అంజలిగుండం గ్రామాల నుంచి 78 కుటుంబాలకు చెందిన 184 మంది టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరారు. శుక్రవారం వీరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే పాల్గుణ సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారన్నారు. 2024 ఎన్నికల్లోనూ టీడీపీ నాయకులకు మళ్లీ ఓటుతోనే ప్రజలు బుద్ధి చెప్తారన్నారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, పార్టీ మండలాధ్యక్షుడు ఆనంద్, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, కొత్తూరు సర్పంచ్ సీతయ్య, మార్కెట్ యార్డు డైరెక్టర్ సూర్యనారాయణ, స్వామి, గంగులు, డానియేలు, నవీన్ పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

ఏకసభ్య కమిషన్ రద్దు చేయాలని డిమాండ్

కొయ్యూరు: బోయ వాల్మీకి కులాలపై ప్రభుత్వం నియమించిన ఏకసభ్య కమిషన్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు ఎస్ సూరిబాబు, సీఐటీయూ నేత వై. అప్పలనాయుడు ఆధ్వర్యంలో జీవో ప్రతులను శుక్రవారం దహనం చేశారు. రాష్ట్రంలో 28 లక్షల మంది గిరిజనులకు సరైన రిజర్వేషన్లు వర్తించడం లేదని వాపోయారు. ఇప్పుడు 50 లక్షల బోయ వాల్మీకులను గిరిజన తెగలో కలపితే, నిజమైన గిరిజనులకు అన్యాయం జరుగుతుందన్నారు. వెంటనే జీవో 52ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన సంఘ సభ్యులు గుంజిగెడ్డ చినబాబు, నాని, పాల్గొన్నారు.

22 మందికి ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ


ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను అందజేస్తున్న సర్పంచ్ అప్పలమ్మ

జి.మాడుగుల: గడుతూరు పంచాయతీ గొంపం గ్రామంలో 55 ఎకరాలకు సంబంధించి 22 మంది లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్వోఎఫ్ఆర్ పట్టాలను మంజూరు చేసింది. వీటిని సర్పంచ్ కొండపల్లి అప్పలమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చంద్రపతి శుక్రవారం పంపిణీ చేశారు. వీఆర్వో, వీఆర్‌ఏ పాల్గొన్నారు.

రూ.15 లక్షలతో సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న వైస్ ఎంపీపీ ఆనందరావు, సర్పంచ్ హరి

డుంబ్రిగుడ: కంద్రుం పంచాయతీ కొరంజిగుడలో రూ.15 లక్షలతో చేపట్టే సీసీరోడ్డు నిర్మాణానికి వైస్ ఎంపీపీ శెట్టి ఆనందరావు, సర్పంచ్ హరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆదేశాల మేరకు గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వారు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు బలరాం, శోభన్, శత్రుగున్, శ్రీనివాసరావు, లచ్చన్న పాల్గొన్నారు.

యాప్‌లో వేతనదారుల ఫొటోలు అప్‌లోడ్ చేయండి


వీఆర్పీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో

గూడెంకొత్తవీధి: వీఆర్పీలంతా విధిగా రోజుకు రెండుసార్లు ఉపాధి హామీ వేతనదారుల ఫొటోలను అప్‌లోడ్ చేయాలని ఎంపీడీవో ఉమామహేశ్ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన ఏపీవో రాంప్రసాద్‌తో కలిసి వీఆర్పీలతో మాట్లాడారు. ఉదయం పని ప్రారంభం కాగానే ఒకసారి, మరో నాలుగు గంటల తర్వాత మరొకసారి యాప్‌లో కూలీల ఫొటోలను తీసి అప్‌లోడ్ చేయాలన్నారు. ఉపాధిలో అవినీతిని అరికట్టేందుకు కేంద్రం ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. లేదంటే చేసిన పనులు లెక్కలోకి రావన్నారు.

సంక్షేమ పథకాలపై గిరిజనులకు అవగాహన


పూలజాల్మలో గిరిజనులకు సంక్షేమ పథకాలపై వివరిస్తున్న మండలాధ్యక్షుడు మల్లికార్జున్

ముంచంగిపుట్టు: బుంగాపుట్టు పంచాయతీ పూలజల్మా గ్రామాన్ని శుక్రవారం వైఎస్సార్ సీపీ నేతలు సందర్శించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి గిరిజనులకు అవగాహన కల్పించి, అందుతున్న తీరుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండలాధ్యక్షుడు పాంగి మల్లికార్జున్ మాట్లాడుతూ సీఎం జగనన్న తెచ్చిన సచివాలయ, వలంటీర్ల వ్యవస్థతో మారుమూల గ్రామాల్లో సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయని పేర్కొన్నారు. సర్పంచ్ జె.నోబిన, నేతలు కొండలరావు, అప్పారావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలి


వేటుకూరులో వృద్ధురాలికి సంక్షేమ పథకాలు గురించి వివరిస్తున్న ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

మారేడుమిల్లి: ఏజెన్సీలో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదగాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని వేటుకూరు పంచాయతీ పరిధి వేటుకూరు, కొత్తవలస, పందిరిమామిడికోట గ్రామాల్లో గడప గడగపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల్లో మహిళలు వారికి పూలమాలలు వేసి హారతులు పట్టారు. 152 గడపలను సందర్శించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాధవి, ఎమ్మెల్యే ధనలక్ష్మి మాట్లాడుతూ గిరిజన సంక్షేమం, అభివృద్ధే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. ఏ ఇంటికి వెళ్లినా విశేష స్పందన లభిస్తోందన్నారు. ఎదురొచ్చి తమకు స్వాగతం పలుకుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను సీఎం జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారని తెలిపారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలనను తీసుకువచ్చారని కొనియాడారు. పలు సమస్యలను గిరిజనులు ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం పందిరిమామిడికోటలో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వీరకిశోర్, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, వైస్ ఎంపీపీ లక్కోండ రవికుమార్, మండల కో-ఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, సర్పంచ్ కొండా జాకబ్, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, నాయకులు బులసుమిల్లి చంటి, దూడ స్మిత్, సార్ల లింగారెడ్డి, గొర్లె అనిల్ ప్రసాద్ (బాబీ), చిన్న నారాయణరావు, మురళీ, విక్టర్ బన్ను పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే పాల్గుణ


పొలం పనుల వద్ద గిరిజన మహిళతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: మారుమూల గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలను చేపడుతున్నామని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. శుక్రవారం ఎన్‌ఆర్‌పురం పంచాయతీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పెదకోనేల, పెద్దూరు, డేంజనివలస, నాయుడువలస, చిమిడివలస, వై.కోటపర్తి, డి.కోటపర్తి గ్రామాల్లో 162 గడపలకు ఆయన వెళ్లి, సంక్షేమ పథకాల గురించి గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా ఎమ్మెల్యేకు గిరిజన సంప్రదాయంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌ఆర్ పురం, రొంపల్లి, గుమ్మకోట, భీంపోల్, గరుగుబిల్లి నాన్ షెడ్యూల్డ్ పంచాయతీలను షెడ్యూల్ పంచాయతీలు మార్చాలని, టీఏసీ తీర్మానంతోపాటుగా ముఖ్యమంత్రి దృష్టిలో పెట్టి న్యాయం చేస్తామన్నారు. 2024లోని మళ్లీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించాలని, అభివృద్ధి, సంక్షేమ పాలనకు నాందిపలకాలన్నారు. కోటపర్తిలోని భీమవారం పీహెచ్‌సీ వైద్యాధికారి అరుణ ఆధ్వర్యంలోని వైద్య శిబిరం నిర్వహించారు. ఎమ్మెల్యే పాల్గొని, గిరిజనులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. ఏజెన్సీ వ్యాప్తంగా లంపీ వ్యాధితో పశువులు మృత్యువాత పడుతుండటంతో సిబ్బంది అప్రమత్తం ఉండాలని సూచించారు. అనంతరం గిరిజన రైతుల పశువులకు సంబంధించిన బీమా పత్రాలను అందజేశారు. ఎంపీపీ శెట్టి నీలవేణి, ఎంపీటీసీ మితుల, సర్పంచ్ సన్యాసమ్మ, పశువైద్యాధికారి గణేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శెట్టి గంగాధరస్వామి, పార్టీ మండలాధ్యక్షుడు శెట్టి ఆనంద్, నాయకులు దానియేలు, ఎంపీడీవో శ్రీహర్షిత్, కార్యదర్శులు శ్రీనివాస్‌రెడ్డి, అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి


సంతారిలో ఇళ్లను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ మోహన్‌రావు, సిబ్బంది

హుకుంపేట: పీఎంఏవై-వైఎస్సార్ గ్రామీణ గృహ నిర్మాణ పథకం కింద నూతనంగా మంజూరైన గృహాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈఈ కె.మోహన్‌రావు ఆదేశించారు. తంతారి పంచాయతీలో గృహ నిర్మాణ పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో మొదటి విడతగా 523 మందికి గృహాలు మంజూరయ్యాయని, లబ్ధిదారులు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని పేర్కొన్నారు. నిర్మాణ పనులు ప్రారంభించిన 122 మందికి మూడురోజుల వ్యవధిలో బేస్‌మెంట్ లెవెల్ బిల్లు రూ.35 వేలు, రూఫ్ లెవెల్ రూ.35 వేలు, స్లాబ్ బిల్లు రూ.35 వేల చొప్పున మొత్తం రూ. 1.80 లక్షలు వారి ఖాతాల్లో జమ కానుందన్నారు. ఏఈఈ వర్క్ ఇన్‌స్పెక్టరు గౌరీశంకర్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీసీసీ బీఎంగా మల్లేశ్వరరావు బాధ్యతలు



గూడెంకొత్తవీధి: గూడెం జీసీసీ బీఎంగా గాసాడి మల్లేశ్వరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న బీఎం కృపానందం అనారోగ్యంతో సెలవుపై వెళ్లారు. దీంతో నర్సీపట్నం కాఫీ గోడౌన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న మల్లేశ్వరరావును నియమించారు. ఆయను తాత్కాలిక బీఎంగా విధులు నిర్వహిస్తారని చింతపల్లి బీఎం సింహాద్రి తెలిపారు.

ఈ- క్రాప్ నమోదు పునః పరిశీలన


ఈ-క్రాప్ నమోదు పరిశీలిస్తున్న ఏవో

గూడెంకొత్తవీధి: ఈ-క్రాప్‌లో నమోదు చేసిన పంటల వివరాలను తెలుసుకునేందుకు వీలుగా ఏవో మధుసూదన్ పునః పరిశీలన చేశారు. అసరాడలో సర్వే నంబర్‌తోపాటు వేసిన పంటలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ-క్రాప్‌లో విధిగా పంటతోపాటు సర్వే నంబర్ నమోదు చేయాలన్నారు. అప్పుడే పంటకు నష్టం వాటిల్లితే ప్రభుత్వం నుంచి పరిహారం వస్తుందన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం


ఎం. మాకవరం విచ్చేసిన వైద్య సిబ్బంది


రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీదుర్గ

కొయ్యూరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టారు. శుక్రవారం ఎం. మాకవరం సచివాలయంలో రాజేంద్రపాలెం వైద్యుడు సంపత్‌బాబు ఫ్యామిలీ డాక్టర్‌గా విధులు నిర్వహించారు. తొలి రోజు అక్కడకు వచ్చిన వారికి ఓపీ చూశారు. అవసరమైన మందులను అందజేశారు. సచివాలయానికి నెలలో రెండు సార్లు వస్తారు. అత్యవసరమైతే వైద్యులను వారు సంప్రదించవచ్చు. దీని కోసం వైద్యులకు ఫోన్లు అందజేశారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమానికి ఆశ కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, వైద్య సిబ్బంది విధిగా వస్తారు. ఓపీ ముగిసిన అనంతరం మధ్యాహ్నం నుంచి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శిస్తారు. సీహెచ్‌వో ప్రశాంత్, హెచ్‌వీ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందుబాటులోకి వైద్య సేవలు

అడ్డతీగల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని దుప్పులపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం.స్పందన తెలిపారు. శుక్రవారం డి.రామవరంలో 104 వాహన సిబ్బందితో కలిసి ఆమె వైద్య సేవలందించారు. 15 మంది గర్భిణులతోపాటు మరో 45 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. సుగర్, బీపీ ఈసీజీ తదితర పరీక్షలు నిర్వహించారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. వైద్యుడు నాగేశ్వరరావు, 104 డివిజనల్ మేనేజర్ మునగా సతీష్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తంటికొండలో 30 మందికి వైద్య సేవలు

రాజవొమ్మంగి: ఏపీ వైఎస్సార్ రూరల్ క్లినిక్ ఉచిత వైద్య శిబిరం శుక్రవారం తంటికొండ గ్రామంలో జరిగింది. రాజవొమ్మంగి పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీదుర్గ 30 మంది సాధారణ రోగులకు, ఐదుగురు బాలింతలకు, ఐదుగురు గర్భిణులకు, చిన్నారులకు వైద్య సేవలందించారు. వైద్య సిబ్బంది గాయత్రి, సన్యాసమ్మ, అమ్మిరాజు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి


సీలేరులో విద్యార్థుల మానవహారం


రాజవొమ్మంగిలో కొవ్వొత్తుల ర్యాలీ

సీలేరు/మోతుగూడెం/రంపచోడవరం/చింతూరు/రాజవొమ్మంగి/డుంబ్రిగుడ/చింతపల్లి: అన్ని మండల కేంద్రాల్లో శుక్రవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం నిర్వహించారు. 2008లో ఒడిశా అటవీ ప్రాంతంలో కూంబింగ్‌కి వెళ్లి తిరిగి వస్తుండగా మావోయిస్టుల చేతిలో 38 మంది గ్రేహౌండ్స్ పోలీసులు మృతి చెందారు. వారందరికీ పేరు పేరునా నివాళులర్పించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల నుంచి అమరవీరుల స్తూపం వరకు ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ఆసువులు బాసిన పోలీస్ అమరవీరుల త్యాగాలు మరువలేనివని అరకు, రంపచోడవరం, చింతూరు సీఐలు దేముడు బాబు, సురేష్‌బాబు, సీఐ అప్పలనాయుడు అన్నారు. అమరవీరుల స్తూపాలకు నివాళులర్పించారు. సీఆర్పీఎఫ్ డీఎస్పీ దివాకర్, ఎస్సైలు రామకృష్ణ, మోహన్‌కుమార్, యాదగిరి, ఎస్సైలు గోపీ నరేంద్ర ప్రసాద్, షరీఫ్, సంతోష్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


డుంబ్రిగుడలో ర్యాలీ చేస్తున్న అరకు సీఐ దేముడుబాబు, పోలీసులు, విద్యార్థులు


రంపచోడవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న పోలీసులు

డిప్యూటీ సివిల్ సర్జన్‌గా కీర్తి



చింతపల్లి: స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా ప్రసూతి వైద్య నిపుణురాలు కీర్తి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సివిల్ సర్జన్‌గా పనిచేస్తున్న మహేశ్వరరావుకు పశ్చిమ గోదావరి జిల్లా డీఎంహెచ్‌వోగా బదిలీ అయింది. ఆయన స్థానంలో స్థానిక ప్రసూతి వైద్యాధికారి కీర్తికి డిప్యూటీ సివిల్ సర్జన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆమెను డాక్టర్ హిమబిందు, సుధాశారద, ఎల్‌టీ అనిల్ అభినందించారు.

రోగులకు మెరుగైన వైద్య సేవలు


కమిటీ సభ్యులు త్రిమూర్తులు, వైద్యాధికారి గౌతమి

వై.రామవరం: స్థానిక సీహెచ్‌సీలో రోగులకు మెరుగైన వైద్య సేవలందించి, ఆస్పత్రి పేరు ప్రఖ్యాతులు కొనసాగాలని ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గుడ్ల త్రిమూర్తులు అన్నారు. శుక్రవారం ఆస్పత్రిలోని సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర మండలాల నుంచి రోగులు వస్తున్నారన్నారు. ఇక్కడ అందుతున్న సేవలతో మంచి పేరుందన్నారు. దాన్ని కాపాడుకునే బాధ్యత సిబ్బంది, వైద్యాధికారులపైనే ఉందన్నారు. సూపరింటెండెంట్ ఎం గౌతమి ఆధ్వర్యంలో సమావేశంలో ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

దోమల నివారణకు గంబూషియా చేప పిల్లలు


పూతిగుంట చెరువులో గంబూషియా చేప పిల్లలను విడచి పెడుతున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

వై.రామవరం: మలేరియా టెక్నీషియన్ పల్లాల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని వై.రామవరం, యార్లగడ్డ, పనసలపాలెం, పూతిగుంట, దాలిపాడు, పెదఊలెంపాడు, కె.యర్రగొండ, కోట, బుల్లోజిపాలెం యర్రంరెడ్డిపాలెం గ్రామాల చెరువుల్లో గంబూషియా చేప పిల్లలను చవిటిదిబ్బలు పీహెచ్‌సీ వైద్యాధికారి జి.శిరీష శుక్రవారం విడిచి పెట్టారు. ఇవి దోమలు వృద్ధి చెందకుండా వాటి లార్వాను తినేస్తాయన్నారు. సచివాలయాల సిబ్బంది, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి సమష్టి కృషి


మాట్లాడుతున్న ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ మత్స్యలింగం

హుకుంపేట: గ్రామాల అభివృద్ధికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు సమష్టిగా కృషి చేయాలని ఎంపీపీ కూడా రాజుబాబు, జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పంచాయతీ పరిధిలో డ్రైనేజీలు, సీసీరోడ్లు, మంచినీరు తదితర అభివృద్ధి పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. వీటిని పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు కలిసి ఖర్చు చేయాలన్నారు. ప్రొటోకాల్ తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. సచివాలయాల్లో ఉద్యోగులు నిత్యం అందుబాటులో ఉండాలని సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు ఎం.విశ్వేశ్వరరావు, మండల అసిస్టెంట్ ఇంజినీరింగ్ అధికారి సాంబ పాల్గొన్నారు.

త్వరలో పెదగూడ ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం

ముంచంగిపుట్టు: త్వరలో పెదగూడ ఆరోగ్య ఉప కేంద్రం ప్రారంభం కానుందని ఎంపీడీవో ఎస్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఇక్కడ ఆరోగ్య ఉప కేంద్రం, అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. వైద్యసిబ్బందితో మాట్లాడి మిగిలిన పనుల వివరాలను తెలుసుకున్నారు. గ్రామ సచివాలయాన్ని సందర్శించి, రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాలలో మెనూ పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పంచాయతీ కార్యదర్శి ఎల్.కృష్ణ పాల్గొన్నారు.

మ్యుటేషన్‌తో పాసు పుస్తకాలు

పాడేరు రూరల్: పట్టాదారులు ఎవరైనా మృతి చెందితే వారి సంబంధికులు గ్రామ సచివాలయంలో మ్యుటేషన్ చేయించుకుంటే పట్టాదారు పాస్ పుస్తకాలు పొందవచ్చని సర్పంచ్ కొట్టగుల్లి ఉషారాణి తెలిపారు. శుక్రవారం స్థానిక మేజర్ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ వంజంగి త్రినాథ్‌నాయుడు మాట్లాడుతూ మ్యుటేషన్ చేయించుకునేందుకు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డు, కుటుంబ సభ్యుల పట్టాదారు పాస్ పుస్తకాలు జతపరిచి గ్రామ సచివాలయానికి అందజేయాలన్నారు. పంచాయతీ ఈవో కృష్ణారావు, వీఆర్వోలు పద్మ, జోగారావు, సచివాలయ కార్యదర్శులు దివాకర్, విజయ్ పాల్గొన్నారు.

కాఫీ, మిరియాల మార్కెటింగ్‌పై శిక్షణ

జి.మాడుగుల: అల్లూరి జిల్లాలో రైతులు తమ కాఫీ, మిరియాల పంటలకు గిట్టుబాటు ధరలకు విక్రయించుకుని లబ్ధి పొందాలని ఐటీడీఏ కాఫీ హెచ్‌వో జి. అప్పలనాయుడు, ఏవో రవీంద్రబాబుపాత్రుడు తెలిపారు. శుక్రవారం గడుతూరు పంచాయతీ పచ్చనాపల్లి, విందులపనుకు, గొంపం గ్రామాల్లో రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు కాఫీ, మిరియాలు నాణ్యతను బట్టి గిట్టుబాటు ధర నిర్ణయించి మార్కెటింగ్ చేయాలని సూచించారు. జీసీసీ చెల్లించే ధర కంటే ఎక్కువ ధరలు వస్తే అక్కడ విక్రయించుకోవచ్చని సూచించారు. సర్పంచ్ కొండపల్లి అప్పలమ్మ, ఫీల్డ్ కన్సెల్టెంట్, జగదీష్, కాఫీ లైజన్ వర్కర్ బాబూరావు, వీఆర్వో పాల్గొన్నారు.

పశువుల మృతికి నష్టపరిహారం అందిస్తాం

ముంచంగిపుట్టు: పిడుగుపాటుకు గురై మృతి చెందిన పశువులకు నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని కిలగాడ పశువైద్యాధికారి ఎం.సౌజన్యదేవి తెలిపారు. బాబుశాల పంచాయతీలో పిడుగుపాటుకు గురై మూడు పశువులు మృతి చెందడంతో శుక్రవారం ఆమె బాధిత రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. పశు నష్ట పరిహార పథకం కింద రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు మంజూరయ్యే అవకాశం ఉందన్నారు. పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలి

చింతపల్లి రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలని ఏపీ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యదర్శి మహేష్ కోరారు. జీపు జాతా ఐదో రోజు కార్యక్రమంలో భాగంగా మండలంలోని పలు పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. నాడు-నేడులో పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నప్పటికీ చాలా వాటిల్లో సమస్యలు యథావిధిగా ఉన్నాయని వాపోయారు. తాము గుర్తించిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. నాయకులు లోచలి రామకృష్ణ, రాంబాబు, దేముడు, శెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

ఆటో బోల్తా : పది మందికి గాయాలు


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

చింతపల్లి: తాజంగి రిజర్వాయరు సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆటో ప్రమాదానికి గురైంది. అందులో ప్రయాణిస్తున్న పది మంది గాయపడ్డారు. జి.మాడుగుల మండలం కులుపాడుకు చెందిన గిరిజనులు బాసింగికొత్తూరులో బంధువుల ఇంట్లో ఓ కార్యక్రమానికి వచ్చి తిరిగి వెళ్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో వంజరి గంతమ్మ, బోనంగి మచ్చమ్మ, వండలం బంగారమ్మ, అన్నపూర్ణలకు బలమైన గాయాలయ్యాయి. వీరిలో వంజరి గంతమ్మను నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి, మిగిలిన ముగ్గురిని పాడేరు ఆస్పత్రికి తరలించారు. స్వల్పంగా గాయపడిన వారికి తాజంగి ఆస్పత్రిలో వైద్యాధికారులు సావిత్రి, సంతోష్ వైద్యం అందించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు భజన పోటీలు దోహదం


భజన సంఘాల ప్రతినిధులను సన్మానిస్తున్న మాజీ మంత్రి బాలరాజు, సాయిరామ్ స్వామిజీ

జి.మాడుగుల: హిందూ ధర్మ పరిరక్షణకు, భజన సంప్రదాయ సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యరాస బాలరాజు, భీమిలి సద్గురు సేవాశ్రమం, స్థానిక హనుమ ఆశ్రమం ప్రతినిధి సాయిరామ్ స్వామిజీ తెలిపారు. జి.మాడుగుల మండలం గాంధీనగరంలోని పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం జిల్లా స్థాయి భక్తి గీతాల భజన పోటీలను వారు ప్రారంభించారు. ఈ పోటీల్లో 18 భజన సంఘాలు పాల్గొంటున్నాయి. న్యాయనిర్ణేతలుగా విశాఖపట్నం సంగీత విద్వాంసులు, గాయకుడు శంకరం త్రినాథస్వామి, గాయకుడు వాసుపల్లి పోతన్నస్వామి, డోలక్, కీబోర్డు వాయిద్య కళాకారుడు కంబాల సాయిరాజు వ్యవహరిస్తున్నారు. వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మత్స్యరాస మత్స్యరాజు, ఈవోపీఆర్డీ ఆర్‌వీఎస్ రమేష్, సర్పంచ్ కిముడు రాంబాబు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మత్స్యకొండం నాయుడు పాల్గొన్నారు.

పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు

డుంబ్రిగుడ: అరమ పంచాయతీ మంజాగుడ గ్రామంలో శుక్రవారం పశుసంవర్ధక శాఖ వైద్యాధికారి రాజశ్రీ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 213 పశువులకు లంపీస్కిన్ వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లంపీస్కిన్ పశువు శరీరంలో ఎటువంటి పొక్కులు వచ్చిన వెంటనే సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. పశువులకు వ్యాధులు వచ్చినప్పుడు వాటిని వేరు చేసి కట్టుకోవాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది రత్నం, త్రినాథ్‌రావు, సంజీవ్, ఆనంత్, మహేష్, జయరాజు పాల్గొన్నారు.

24లోగా రెండో విడత కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్

అరకులోయ: స్థానిక డిగ్రీ కళాశాలలో 2023 విద్యా సంవత్సరానికి సంబంధించి మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయిందని ప్రిన్సిపాల్ రామకృష్ణ శుక్రవారం తెలిపారు. ఈ నెల 21 నుంచి 24వ తేదీ లోపు రెండో విడత కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వచ్చే నెలలో సీట్లు కేటాయిస్తామన్నారు. ఎంపీసీ- 41, సీబీజెడ్ -42, ఎంపీసీ(సీఎస్) -26, బీఏ -44, బీకాం జనరల్ -37, బీకాం కంప్యూటర్స్ -36 సీట్లు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు.